క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



వర్ధన్నపేట : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో కనుక్కొని బాధితుడికి గురువారం అందజేసినట్లు వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఇల్లందకు చెందిన మంద సంతోష్ తన రూ. 20 వేల విలువ గల మొబైల్‌ను అక్టోబర్ 29న పోగొట్టుకున్నాడు. సెల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను వెతికి సంతోష్‌కు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

'సఖి' సేవలపై అవగాహన



గీసుకొండ : మండలంలోని మనుగొండలో స్వయం సహాయక సంఘాల మహిళలకు, ధర్మారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సఖి కేంద్రం అందజేస్తున్న సేవలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో మహిళలు, బాలికలు హింసకు గురి అవుతున్న తీరుతో పాటు వాటిని రూపుమాపడానికి సఖి కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను సఖి కౌన్సిలర్ సుధా, నిర్మలాదేవి వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే మహిళా హెల్ప్‌లైన్ 181కు కాల్ చేసి సత్వర సహాయం పొందాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, ఇందిరా రాణి, ప్రమీల, వీఏఏ సాంబరాజు పాల్గొన్నారు.

'దగాపడ్డ యువత'

గీసుకొండ : బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత దగాపడ్డారని, ఇప్పటికైనా మేల్కొని అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలని టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గాదె దయాకర్ అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ యువత, కార్యకర్తలు తన వెంట ఉండి గెలిపించాలని కోరారు.

'కేసీఆర్‌ను గద్దె దించాలి'

చెన్నారావుపేట : మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించాలని బీఎస్పీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుండాల మదన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు చెన్నారావుపేట, పాత మగ్దుంపురం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ను ఓడించకపోతే తెలంగాణ రాష్ట్రాన్ని అమ్ముకుంటారని విమర్శించారు. ఏనుగు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే బహుజనుల పాలన వస్తుందన్నారు. నాయకులు, యువకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాటలు నమ్మొద్దు



ఖానాపురం: పెద్ది సుదర్శన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



దబ్బీరుపేటలో ఓటు అభ్యర్థిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

● బీఆర్‌ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది

ఖానాపురం : కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రేషన్ కార్డులు తీసుకుని సిమెంటు బస్తాలను ఇష్టారీతిన తిన్న కాంగ్రెస్ నాయకులు రోగాల బారిన పడ్డారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని చిలుకమ్మనగర్, కీర్యతండా, దబ్బీరుపేట, చిలుకమ్మతండా, పర్శతండా, అయోధ్యనగర్, అశోక్‌నగర్, బండమీదిమామిడితండా, మనుబోతులగడ్డ, ఖానాపురం గ్రామాల్లో గురువారం పెద్ది ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలు, కోలాటాలతో స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. ప్రచారంలో మాట్లాడుతూ పార్టీలు మారుతున్న మాజీ ఎమ్మెల్యేలు జెండాలు మోసిన కార్యకర్తలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఓట్ల సమయంలో ఒక మాట, ఓట్లు ముగిశాక మరోమాట మాట్లాడడం వారికే దక్కుతుందన్నారు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మొద్దని, గోదావరి జలాలు తెస్తే కాళ్లు కడుగుతామన్న కాంగ్రెస్ నాయకులు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. పక్క రాష్ట్రం నుంచి డబ్బు సంచులతో వచ్చి కొంత మంది తనను ఓడించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, రాణాప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరిరావు, సర్పంచ్ నీలమ్మరాజు, రవీందర్‌రావు, వేజెళ్లకిషన్‌రావు, వడ్డే వెంకటేష్, దాసరి రమేష్, మస్తాన్, దేవేందర్‌రావు, వల్లెపు శ్రీనివాస్, రాజశేఖర్, యాదగిరి, సంపత్, యువరాజు పాల్గొన్నారు.

పెద్ది స్వప్న ఇంటింటి ప్రచారం

దుగ్గొండి : మండలంలోని లక్ష్మీపురం, బంధంపల్లి, దేశాయిపల్లి గ్రామాల్లో నర్సంపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి స్వప్న గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. నర్సంపేటలో ఎమ్మెల్యేగా పెద్ది చేసిన పనులను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, సుకినె రాజేశ్వర్‌రావు, కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, సురేష్, సుమన్, పోశాలు, రవి, శ్రావణ్, కట్టయ్య, శోభన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష



నర్సంపేట: సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ కుర్మాచలం, మహేష్

నర్సంపేట : కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎన్నారై యూకే వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం, ఎన్నారై యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ తన్నీరు మహేష్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నారై బీఆర్‌ఎస్ నాయకులు బానబోయిన రాజ్‌కుమార్, పిన్నా భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖండాంతరాలు దాటినా తాము తెలంగాణ ప్రాంత బిడ్డలమని, ఈ ప్రాంత అస్తిత్వాన్ని కాపాడే ఏకైక వ్యక్తి కేసీఆర్ అన్నారు. నర్సంపేటలో పెద్ది సుదర్శన్‌రెడ్డి అంటే తమకు ప్రత్యేక అభిమానం అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నారై నాయకులు ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి, పిన్నా భాస్కర్, బిందు లత, కడుదుల రత్నాకర్, గొట్టెముక్కల సతీష్‌రెడ్డి, మధుయాదవ్, బానబోయిన రాజ్‌కుమార్, కొరబోయిన విజయ్, సాంబరాజు, వీరేందర్ పాల్గొన్నారు.

పెద్దిని భారీ మెజార్టీతో గెలిపించాలి



చెన్నారావుపేట: మాట్లాడుతున్న వాసునాయక్

చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్, భూక్యా జగన్ నాయక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పుల్లయ్యబోడు తండా శివారు లింగ్యా తండాలో గిరిజనులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గిరిజనులకు కేసీఆర్ గిరిజన బంధు, రిజర్వేషన్, బీటీ రోడ్లు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాడని అన్నారు. కేసీఆర్ రుణం తీర్చుకోవడానికి కారు గుర్తుకు ఓటేయ్యాలని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ బోడ సమ్ము నాయక్, గ్రామ అధ్యక్షుడు అజ్మీరా భిక్షపతి నాయక్, సుభాష్, కిషన్, రవీందర్, బాలాజీ తదితరులు ఉన్నారు.

పుస్తక ప్రదర్శన



నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ లైబ్రరీ సైన్స్ హెచ్‌ఓడీ డాక్టర్ బి.రాధికరాణి హాజరయ్యారు. కళాశాల గ్రంథాలయ శాఖ అధికారి డాక్టర్ ఆర్.కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులకు చినిగిన చొక్కా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎ.లావణ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ తోట రమేష్, సత్యనారాయణ, ప్రసూన, ఎం.నరేందర్, ఐ.శివనాగ శ్రీను, జె.లకన్ సింగ్, ఎం.నరేందర్, రమేష్, పూర్ణచందర్, సమ్మయ్య, ఎం.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నర్సంపేట : నర్సంపేటలో నేడు(శుక్రవారం) రాహుల్‌గాంధీ రోడ్ షో, కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధికారి ప్రతినిధి గుంటి వీరప్రకాశ్ గురువారం ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలో దొంతి మాధవరెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించాలని అందుకు నర్సంపేట ప్రజల ఆశీర్వాదం కోసం రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్ షో పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమై అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ప్రసంగిస్తారని అన్నారు. అనంతరం రోడ్ షో పాకాల సెంటర్ వరకు కొనసాగుతుందని చెప్పారు.

వైద్యసేవలపై అవగాహన ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సరోజ

చెన్నారావుపేట : వైద్యసేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సరోజ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఆన్ జాబ్ ట్రెయినింగ్‌లో భాగంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రతి విభాగం పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ సరోజ మాట్లాడుతూ.. ఓపీ, ల్యాబ్, ఫార్మసిస్ట్, బీపీ, షుగర్ పరీక్షతో పాటు మహిళలకు ప్రత్యేకంగా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, స్టాఫ్ నర్స్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు గౌర్రె విపంచి, మురహరి మౌనిక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

23వ మండల పూజలు ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

నర్సంపేట : శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో గురువారం 23వ మండల పూజా మహోత్సవాలు, మహా అన్నదాన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండల పూజ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. మాధవశంకర్‌గుప్తా మాట్లాడుతూ నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలని కోరారు. రాష్ట్ర, జిల్లా, డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో మహా అన్నదానం గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌ఈశ్వరయ్య, మాదారపు చంద్రశేఖరం గుప్తా, తోట సంపత్‌కుమార్, గోనెల రవీందర్, తక్కళ్లపల్లి యుగంధర్‌రావు, దేవునూరి అంజయ్య, ఇరుకు కోటేశ్వర్‌రావు, విభూతి శివకుమార్, కోమాండ్ల భూపాల్‌రావు, ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, గర్నెపల్లి శ్రీనివాస్, కిషన్, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, వెంకటనర్సింహారావు, శ్రీరాముల శంకరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్ గుప్తా, పాలకుర్తి శ్రీనివాస్, చకిలం కృష్ణమూర్తి, వంగేటి గోవర్ధన్, బండారిపల్లి చెంచారావు, చింతల నిరంజన్, భూపతి లక్ష్మీనారాయణ, దొడ్డ వేణు, మల్యాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సురేష్

పర్వతగిరి : మండలంలోని సీ.కే తండా, మూడు తండా, ముంజాలకుంట తండా, బూర్గుమళ్ల, పెద్ద తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సీఈఓ సీహెచ్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి తీసుకువచ్చిన ధాన్యానికి మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పర్వతగిరి, చింతనెక్కొండ గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏపీఎం కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



పెర్కవేడులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాయపర్తి : ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా వినియోగించుకోవాలని వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు, పెర్కవేడు, సూర్యతండా గ్రామాల్లో స్థానిక పోలీసులు, బీఎస్‌ఎఫ్ జవాన్‌ల ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎస్సై దేశిని విజయ్‌కుమార్, పోలీసులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి



దేవరుప్పుల: గులాబీ జెండాలే పాటకు స్టెప్పు వేస్తున్న ఎర్రబెల్లి



పాలకుర్తి: మాట్లాడుతున్న దయాకర్‌రావు

● బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: ఆరు దశాబ్దాల్లో జరుగని అభివృద్ధిని కేసీఆర్ సారథ్యంలో పదేళ్లలో నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేశానని, నిండు మనసుతో ప్రజలు ఆశీర్వదించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని నల్లకుంట, చిప్పరాళ్లబండ, పడమటితండా, కోలుకొండ, అప్పిరెడ్డిపల్లె, చిన్నమడూరు, బంజరలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల ప్రదర్శనలతో ఘనస్వాగతం పలుకగా ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తాగు, సాగునీటి కల్పన, విద్య, ఆరోగ్య విభాగాలతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు 90 శాతం పనులు పూర్తి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే మిగిలిన పదిశాతం పనులు పూర్తిచేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన ధ్యేయంగా పనిచేస్తామన్నారు. తాను పాలకుర్తిలో ఎమ్మెల్యేగా కొనసాగిన తరుణంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో గత పాలకులతో బేరీజు వేసుకొని ప్రజల భవిష్యత్ నిర్దేశించే ఈ ఎన్నికలపై ప్రజలు ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలకు బోల్తాపడకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. పలు గ్రామాల్లో పలు పార్టీల నుంచి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రేలారే గంగవ్వ, కనకమ్మలతో గులాబీ జెండాలే అనే పాటకు నృత్యం చేస్తూ ప్రజల్ని మమేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎన్నారై ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, మండల సమన్వయ కర్తలు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషం, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, గ్రామ అధ్యక్షుడు సంతోష్, బాలు, లాల్‌సింగ్, ఎల్లేష్, యాకయ్య, ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే బాధ్యత నాదే..



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

పాలకుర్తి: నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే బాధ్యత తీసుకున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశంలో గురువారం ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. ఒక వైపు ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తూనే, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని ఉద్యోగాలు కల్పించామని అన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదేవి మాట్లాడుతూ తమకు వచ్చిన ఈ అవకాశంతో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులతో ప్రజలు, రైతులు, కార్మికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారన్నారు. మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గం నుంచి సుమారు 2 వేల మంది పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మొద్దు

పెద్దవంగర: కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ఓటేసి మోసపోవద్దని పాలకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన టీడీపీ పెద్దవంగర మండల అధ్యక్షుడు బైన భిక్షపతి గురువారం మంత్రి దయాకర్‌రావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని, పాలకుర్తిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి పాలకుర్తి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే వారంటీ లేని గ్యారంటీ కార్డును ప్రజలు నమ్మొద్దని తెలిపారు. నాయకులు దుంపల సమ్మయ్య, బొమ్మెరబోయిన రాజు, వేణు సాగర్, పాల్గొన్నారు.



రాయపర్తి: బీఆర్‌ఎస్‌లో చేరిన వడ్డెర కులస్తులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

కంటికి రెప్పలా కాపాడుకుంటా..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన వడ్డెర కులస్తులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. సుమారు 15 మంది వడ్డెర కులస్తులు వల్లెపు మహేందర్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో చేరగా వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు, ఎంపీటీసీ బండి అనూషరాజబాబు, గ్రామపార్టీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్నెపు వెంకన్న, అన్నెపు ప్రభాకర్, నాకబోయిన సుధాకర్, బాషబోయిన అశోక్‌లు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి బీఆర్‌ఎస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, ఉప సర్పంచ్ గుడి యుగేంధర్‌రెడ్డి, మైబురెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ద కాలంలోనే అభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్



పర్వతగిరి: ఓటు అభ్యర్థిస్తున్న రమేశ్

● బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్

పర్వతగిరి : ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన అభివృద్ధిని కేవలం దశాబ్ద కాలంలోనే పూర్తి చేసుకున్నామని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఏబీతండా, చింతనెక్కొండ, భట్టుతండా, తూర్పుతండా, గుగులోత్ తండా, ఏనుగల్, మల్యా తండా, మూడెత్తుల తండా, శ్రీనగర్, కొంకపాక, గోపనపల్లి, అనంతారం గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు డప్పు చప్పుళ్లు, కోలాటాలు, బతుకమ్మలు, మంగళహారతులు, గజమాలతో రమేశ్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రాకుండా ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి ఇద్దరు ఎంపీటీసీలు

పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ ఎంపీటీసీ మాలోత్ కాంతమ్మలాలూ, గోపనపల్లి ఎంపీటీసీ సురం రమేశ్ గురువారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే భట్టుతండాకు చెందిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ భట్టు రాంబాబుతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

అభివృద్ధే 'అరూరి'ని గెలిపిస్తుంది


వర్ధన్నపేట : తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో అభివృద్ధి చేసి చూపించిన ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను ప్రజలు మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటారని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి అన్నారు. అరూరిని మూడో సారి గెలిపించి హ్యాట్రిక్ సాధించడానికి గురువారం మండలంలోని ల్యాబర్తి, టీకుల తండా, కొత్తపల్లి, రామోజీ కుమ్మరిగూడెం తదితర గ్రామాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ కార్యకర్తలతో కలిసి గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్‌ఆర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి సుమారు 40మంది కార్యకర్తలు గురువారం బీఆర్‌ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్ ఆహ్వానించారు.

హసన్‌పర్తి: బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హసన్‌పర్తి, ముచ్చర్ల, భీమారం, ఎర్రగట్టు గుట్ట, దేవన్నపేట, మడిపల్లి, అన్నాసాగరం, వంగపహాడ్, పెగడపల్లి, గోపాలపురంలో ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ శివారులో రోడ్డు పక్కన కోతకు గురై ప్రమాదకరంగా మారింది. పెట్రోల్ బంక్ దాటిన తర్వాత బ్రిడ్జి సమీపంలో మూల మలుపు వద్ద భారీ గుంత ఏర్పడింది. ఈ రోడ్డు వెంట నర్సంపేట, కొత్తగూడ, గంగారం మండలాలకు చెందిన ప్రజలు, వాహనదారులు రాక పోకలు సాగిస్తుంటారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోక పోవడంతో వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే తప్ప సమస్యను పరిష్కరించరా? అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఏర్పడిన గుంతను పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.